# భా - రతి

'పోస్టమాన్' వాకిట్లో కేక.

అన్నంతింటున్నవాడల్లా పరాంకుశం సగంలోనే లేచి వెళ్ళి టపా అందుకున్నాడు.-అతని కళ్ళు ఆసక్తితో మెరుస్తున్నాయి. ఆశలు వెల్లివిరుస్తున్నాయి.

'సార్.-పావలా ఇవ్వండి'

'ఎందుకూ' అమాయకంగా అడిగాడు పరాంకుశం 'మీరు పంపిన బుక్ పోస్ట్ తిప్పికొట్టారు.-స్టాంపులు తక్కువైనాయి అందుకని'

నిర్జీవ శిలా ప్రతిమలాగా మారిపోయాడు పరాంకుశం నిమిషంలో-యాంత్రికంగా నడిచివెళ్ళి పావలా తెచ్చి యిచ్చాడు.-పోస్టుమాన్ చేతికందించి వెళ్ళిన బుక్‌పోస్టు నేలపైకి జారిపడింది అనుకోకుండానే!!

నట్టింట్లో కథానిక!!

తన 'వైశంపాయనం' కథను ఈ పత్రిక వారూ తిప్పికొట్టారు!!

అది ప్రచురణకు 'అయోగ్యం' అని అక్కడి సంపాదకవర్గం నిశ్చయించింది!!

అందుకని కథ తిరిగివచ్చింది!!

"రిటర్న్డ్ విత్ థాంక్స్" అని తన్నుగౌరవిస్తూ ఓముద్రకూడా వుంది!!

"వమిటండీ అంతఆదుర్దాగా లేచి వెళ్ళారూ మోరుకోళంబుకూడా వేసుకోకుండానే .. వచ్చిందా ఏమిటి చెక్కు'

పరాంకుశానికి సిగ్గూ అవమానమూ ఒకేసారి కలిగాయి.

చాలారోజులనుండీ శ్రీదేవికి చెబుతున్నాడు తాను ఇటీవల 'వైశంపాయనం' అనే కథ వ్రాశాననీ కథానికా సాహిత్యంలో అదొక మైలురాయివంటిదనీ అది తప్పక ప్రచురింపబడుతుందనీ.-ఆ చెక్కురాగానే కూర్చి కొంత మొత్తం ఆమెకిస్తాననీ.

ఆమెఅన్నది 'చీరెలు చినిగిపోయాయి....కొంతఇస్తే చాలదు మొత్తమూ ఇవ్వవలసిందే '

"కాదు దేవీ.-ప్రస్తుతానికి సగంతీసుకో, మరోకథ తర్వాత వచ్చాక 'మరికొంత ఇస్తాను. నాకు ఇప్పుడు ఛాలా ఖర్చులాన్నాయి.'

శ్రీదేవి సరేనని అంగీకరించింది-నాటినుండి చిరెమీది ఆశతో ప్రతిరోజూ తనకంటే ముందుగా ఆమె పోస్టుమాన్‌కోసం ఎదురు చూస్తున్నది.

అలాంటిదినేడీ పిడుగుపాటు!!

'ఏమిటండీ ఆదీ-ఎంతఇచ్చారేమిటి చెక్కు" శ్రీదేవి వెళ్ళి నేలమీది కవరు పైకి తీసింది.

పరాంకుశం నవనాడులూ కుంగిపోయాయి .. కవరులోపలి రచనను తీసి చూచింది.

ఒక్కసారి పరాంకుశం ముఖంచూచింది.. చూచి, ఫక్కుమని నవ్వి మరీ అన్నది 'వది'.

ఔను! వది పత్రికలనుండి తిరిగి వచ్చింది ఇప్పటికి "వైశంపాయనం"! ఏ సంపాదకుడికీ ఆ కథ నచ్చలేదు-

సంపాదకుడు పాఠకుల తరపున ప్రతినిధి. పాఠకుల అంతరంగం తెలిసిన వత్తేవారు-వాళ్ళకు నచ్చేవే ప్రచురణకంగీకరిస్తాడు. నచ్చనవి తిప్పి పంపుతాడు!!

'వైశంపాయనం' పాఠకులకు నచ్చదంటే నచ్చదని అన్నికోర్టుల నుండీ ఏన్‌గ్రీవంగా తీర్పు వచ్చింది. చివరకు నేడు సుప్రీంకోర్టు కూడా కేసు కొట్టివేసి ఉభయఖర్చులూ పరాంకుశానికే తగిలించింది. కాబట్టే పోస్టుమాన్‌కు డబ్బులిచ్చి మరీ రచనను తీసుకున్నాడు.

శ్రీదేవి తడిచేయి పమిటకు తుడుచుకుంటూ 'ఇప్పటికైనా ఆచాదస్తం నుండి బయటపడి నాలుగు ట్యూషన్లు చెప్పుకోండి. అర్థమూ, పరమార్థమూ రెండూ. దక్కుతాయి.ఎందుకొచ్చిన పిచ్చి కవిత్వాలు చెప్పండి" అంటూ మళ్ళీ నవ్వుకుంటూ వెళ్ళింది.

పరాంకుశానికి ఎవరో గుండెలో అంకుశంతో పొడిచినట్లనిపించింది!

భార్య నవ్వకుండా తన్ను నాలుగతిట్టి ఒక ఏడుపు ఏడ్చినట్లయితే తన కెంతో మనశ్శాంతి లభించేది తన అసమర్థతకు తగినశిక్ష లభించిందని సంతృప్తి చెందేవాడు!! కాని ఆమె నవ్వింది!!

తన పరాభవాగ్నిలో ఆజ్యం పోసినట్లయింద అదరహాసం పరిహాసం!!

ఇంట్లో ఉండేందుకు ముఖం చెల్లక పరాంకుశం వీథిని పడ్డాడు!

గమ్యంలేకుండా అటూఇటూ తిరిగాడు.

సుల్తాను బజారువద్దకు వచ్చేసరికి ఆంజనేయస్వామి గుడి సమీపంలో నేలపైన పుస్తకాలు పరిచివున్నాయి ఓ చిన్నగడ్డంవున్న సాహెబుగారు వాటిని అమ్ముతున్నాడు. భగవద్గీతనుండి బతకమ్మ పాటలవరకూ అన్నిరకాల పుస్త కాలూ అక్కడున్నాయి అక్కడ ఎంతఖరీదైన పుస్తకమైనసరే ఇష్టంవచ్చిన ధరకు అడగవచ్చు కొనవచ్చు సాహిత్యానికక్కడ విలువలేదు అమూల్యం అన్న మాట ఇక్కడ యదార్థం. రోడ్డుమీదనుండి ఫుట్‌పాత్ పైకెక్కి ముద్దుపళని వ్రాసిన రాధికా సాంత్వనం ప్రతిఒకటి వుంటే పుటలు తిప్పుతూవున్నాడు. నిజా నికి ముద్దు పళని మహాకవయిత్రి కాదు వరాంకుశందృష్టిలో. కాని ఆమెకు మహా రాజపోషణ లభించింది దానికితోడు స్త్రీ! ఇంకేంబంగారానికి తావిఅబ్బినట్లైంది.

మంచికైనా చెడుకైనా ఆమెపేరు స్మరించకుండా దక్షిణాంధ్ర వాఙ్మయం ముగియదు!!

వరాంకుశానికి అకస్మాత్తుగా జ్ఞానోదయం కలిగింది!!

గౌతమబుద్ధునికి మహాబోధివద్ద సత్యస్వరూపం తెలిసినట్లు వరాంకుశానికి బడేచావడిలో జనసమ్మర్దం కల నడి రోడ్డువద్ద కాలజ్ఞాన తత్వం బోధపడింది!!

ఇక మారుమాట్లాకుండా సుల్తానుబజారు ఘంట స్తంభం దగ్గరికి పోయాడు. అక్కడ సాయంత్రంపూట సంచార తపాలాఫీసు నిలబడి వుంటుంది. జేబులో వున్న డబ్బులన్నీ ఉపయోగించి పదిహేనుపైసల స్టాంపులు కొను క్కొని ఇంటిముఖం పట్టాడు!!

రాత్రికి రాత్రే కూర్చొని ఓ పాతిక కవర్లకు స్టాంపులు అంటించి అడ్రసులు వ్రాసి దుమ్ముపట్టివున్న పాత ఫైళ్ళన్నీ తీసి అందులోంచి ఓ పాతిక కథారాజాలను బయటకుతీసి బూజుదులిపి రెక్కలుదువ్వి అప్పటికప్పుడే వాటికి ప్రయాణంకట్టిం చాడు!! అంతే!! నిశ్చింతగా నిద్రపోయాడు.

ఆ తర్వాత ఓ నెలరోజులు గడిచింది! ఈ నెలరోజుల్లోనూ ఇటు వరాం కుశంకానీ అటు శ్రీదేవికాని పోస్టుమాన్‌కోసం ఎదురుచూడటం మానివేశారు. పోస్టుమాన్‌కూడా వీళ్ళ ఇంటితో తనకేమీ పల్లనట్లు వెళ్ళిపోయేవాడు.

ఇలావుండగా - ఆ వాడు సాయంత్రం శ్రీదేవి బలవంతంమీద అటు ఆబిడ్స్‌కు బయలుదేరి వెళ్ళి అక్కడినుండి సూపర్‌బజార్‌లోకి ప్రవేశించాడు వరాంకుశం సతీసమేతంగా! కావలసిన వస్తువులేవో క్లుప్తంగా కొన్నాడు.

వస్తువులకన్నా వస్తువులనమ్మే సేల్స్ గర్ల్స్ చేసిన మర్యాదా, గౌర వమూ, మంచితనమూ మాటతీరూ వరాంకుశాన్ని బాగా ఆకర్షించాయి.

'ప్లీజ్ - ఈ పౌవడ్ కొనండి. ఇవి చిక్కడపల్లి కాటేజ్ ఇండస్ట్రీస్‌లో శుచిగా రుచిగా చేసినవి' అని ఓ అమ్మాయి అప్పడాల పాకెట్ చూపుతోంది. పరాంకుశం మారు మాట్లాడకుండా జేబులోంచి డబ్బులు తీసి ఇచ్చాడు.

ఆమె వాటిని కాష్‌బాక్స్‌లో వేసుకొని అత్యాదరంతో చూచి 'థాంక్స్' చెప్పి రసీదు ఇచ్చింది. 'థాంక్స్' అన్న ఆ రెండు అక్షరాలలోనూ పరాంకుశానికి స్వర్గం కనపడింది.

'అదేమిటండీ-ఇంట్లో వున్నాయిగా అప్పడాలు....' శ్రీదేవి సాధించింది.

'అబ్బే ఇక్కడి శుచీ రుచీ చూడు.'

శ్రీదేవికి కోపం వచ్చింది 'ఓహో! తినకుండానే మీకంత శుచీ రుచీ ఎక్కడ కన్పడిందో ... పిల్లతనం బుద్ధులు పోలేదు మీకు. పద పదండి. ఇంకేమీ కొనక్కర్లేదిక్కడ" 'బాగుంది నీ సాధింపు నువ్వు రమ్మన్నావు కనక నే వచ్చాను, లేకుంటే ఆ నారాయణగూడాలోనే కొనివుందును కూరలు.'

'కొన్నారులేండి-చుహో-' రుసరుసలాడుతున్నది శ్రీదేవి. ఆవిడ కోపానికి ఇదీ కారణం అని స్పష్టంగా చెప్పదగింది ఏమీలేదు. తాను గట్టిగా నిలేస్తే జవాబేమీ చెప్పలేదుకూడాను కాని అజ్ఞాతంగా, అదీ-ఇదీ అని చెప్పలేని ఏ కారణం చేత తాను అవసరంలేకపోయినా అప్పడాలు కొన్నాడో. ఆ కారణమే ఆమెలోనూ ఒకానొక అసంతృప్తినే రేకెత్తించిందని మాత్రం తాను ఊహించగలిగి మరిక మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఇద్దరూ సూపరుబజారునుండి బయటపడి నెహ్రూ బొమ్మదాకా వచ్చారు. 'అదుగో ఆ వీక్లీ కొనండి,కొత్తది వచ్చినట్లుంది' శ్రీదేవి ఆజ్ఞ జారీచేసింది.

పరాంకుశం మాట్లాడకుండానే కొని ఇచ్చాడు.

రెండు ఏనుగుల ఎత్తున్న ఎనిమిదోనెంబరు బస్సు కడుపునిండా మనుష్యులను కుక్కుకొని వచ్చి ఆగీ ఆగకుండానే కోఠీదారి పట్టింది. పరాంకుశం రిక్షా మాట్లాడాడు ఇక బస్సులకై ఎదురుచూడకుండా ఇద్దరూ ఎక్కారు. రిక్షా కింగ్ కోఠీ రోడ్డువైపుకు మరల్చాడు 'ఏమండోయ్' పెద్దగా పొలికేకపెట్టింది శ్రీదేవి. పరాంకుశం త్రుళ్ళిపడ్డాడు రిక్షాలో సీటులోనుండి ఏ తేలైనా కుట్టిందేమోనని.

'ఏమిటి. ఏమిట'ని గాభరాగా అడిగేలోపలే శ్రీదేవి వీక్లీని పరాంకుశం చేతికిచ్చింది నివ్వెరపోతూ.... పరాంకుశం ముఖం చిట్లించి పేపరు చేతికి తీసుకొని చూచాడు 'వైశంపాయనం' రచన 'లక్ష్మీకుమారి' అని వుంది. ఆ కథకొక చక్కని పేజీ నిండుగావున్న బొమ్మకూడా గీయబడివుంది.

"ఎవరీ లక్ష్మీకుమారి?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను."

"అసలింతకూ ఇది మీ కథేనా" ఆతురతతో ప్రశ్నించింది.

"ఆఁ. ఆఁ. అలాగేవుంది."

"ఎంత మోసం. ఎవరుకొట్టేశారూ ... అన్నట్లు మొన్న పాత పేపర్లు అమ్మాను, అందులో పొరపాటున ఈ రచనకూడా వీధిని పడిందేమో."

"ఆ.. ఆఁ. అంతే అయి వుంటుంది."

"అయ్యో. ఎంతపనైపోయింది ఉండండి. ఇప్పుడే ఆ పత్రికలవాళ్ళకొక ఉత్తరం వ్రాసి పడేస్తాను."

"చాల్లే ఊరుకో. అదొక లేనిపోని గొడవ నెత్తికి తెచ్చుకోవడం. జరిగిం గిందేదో జరిగిపోయింది. ఇకనైనా జాగ్రత్తగా ఉంటే చాలు...."

కాని శ్రీదేవి వూరుకోలేదు. రిక్షా ఇల్లుచేరేవరకూ అలా నసుగుతూనేవుంది.

పరాంకుశం మాత్రం దొంగకు తేలుకుట్టినట్లు కిమ్మనకుండా వూరుకున్నాడు....

అయితే ఈ ఆట రెండురోజులకంటే సాగలేదు మూడోనాడు ఓ చెక్కు "లక్ష్మీకుమారి" పేర తమ ఇంటికేవచ్చింది. లక్ష్మీకుమారి పేర మరో రెండు కథలు ఆ నెలలోనే అచ్చై వేరే పత్రికలలో వచ్చాయి. వాటి ప్రతులు పారితోషికాలుకూడా ఇంటికి చేరాయి.... చూస్తుండగానె మార్కెట్‌లో లక్ష్మీకుమారికి మంచి గిరాకీ పెరిగింది.

పాఠకులు తమ ఉత్తరాలద్వారా లక్ష్మీకుమారి రచనలు తమ్ముమ్ముగ్ధులను చేశాయని తెలుపసాగారు. సంపాదకులకు ఆమె అడ్రసు తెలుపవలసిందిగా కొందరు పాఠకులు కొన్ని పత్రికలలో అడిగారు. వాళ్ళు అడ్రసు ముద్రించారు అక్కడినుండీ రోజూ లక్ష్మీకుమారిపేర ఓ కట్ట ఉత్తరాలు వస్తూవుండేవి. లక్ష్మీకుమారి వాటన్నింటికీ ఓపికతో జవాబులిచ్చేది ఓరోజు లక్ష్మీకుమారికి ఓ ప్రేమలేఖ వచ్చింది. "ప్రియమైన లక్ష్మీ! కుమారి అన్న నీ పేరునుబట్టి నెనీ సాహసానికి ఒడికట్టాను క్షమించు నీ రచనలు నన్ను మత్తెక్కించాయి. నీ పేరు లక్ష్మి అయినా నీవు అపర సరస్వతివి. నీవంటి రచయిత్రిని వివాహమాడాలని నా హృదయం ఉర్రూతలూగుతున్నది. నన్ను అపార్థంచేసుకోకుండా జవాబియ్యి-నీ...." అని అతగాడు వ్రాసిన ఉత్తరం పరాంకుశం చదివి ఒక్కసారి

గట్టిగా నిట్టూర్చి పక్కనె ఫైలులో పెట్టేశాడు. ఆరోజే మద్రాసులోని ఒక సంస్థ వారు తమ వార్షికోత్సవాలు మ్యూజిక్ ఎకాడమీ హాల్ మద్రాసు 4 లో జరుపు కుంటున్నామనీ అందులో తెలుగుల వెలుగు - ప్రముఖ రచయిత్రి లక్ష్మికుమారిని సన్మానించాలని నిశ్చయించామనీ ఆమోదం తెలుపుతూ ముందుగా ఓ ఫోటో పంపవలసిందనీ వ్రాశారు.

"శ్రీదేవీ" గట్టిగా పిలిచాడు పరాంకుశం.

లోపలనుండి వచ్చింది భార్య!

"ఇదిగో సూడు- నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలని పిలిచాను...." నసిగాడు.

"అలాగే మాట్లాడండి" సూటిగా చూస్తూ అన్నది.

"ఏమీలేదు" అని అటూ ఇటూ చూచి "నీవు మద్రాసు పోవాలి. అంతే!" అన్నాడు తపీసుని.

"ఎందుకు" ప్రశ్నార్థకంగానే చూచింది.

"చెపుతాగా...."

'ముందు చెప్పండి-తర్వాతనే ఏవిషయమైనా" ఖచ్చితంగా అన్నది శ్రీదేవి. ఈమధ్య పరాంకుశం తన దగ్గర దొంగవేషాలు వేసి ఏ విషయమూ స్పష్టంగా చెప్పడంలేదని ఆమెకు బాగాకోపంగా వుంది. పరాంకుశం కొంచెం ఆగి మొదలు పెట్టాడు "అసలువిషయమేమంటే . అదే-నీకుతెలుసుగా లక్ష్మికుమారి పేర కథలు రావడం-అది-నేనే ఆలోచించి అలాచేశాను...తీరాచూస్తే ఇప్పుడు కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయి అందుకని ఆ లక్ష్మికుమారివి నీవేననీ, శ్రీదేవి లక్ష్మిదేవి-లక్ష్మికుమారి ఇవన్నీ సమానార్థకాలేనని ప్రకటించదలచుకున్నాను. మద్రాసులో వాళ్లెవళ్ళో సన్మానం చేస్తారట! అందుకని నిన్ను పంపాలనుకున్నాను-ఇదే కథ టూకీగా...."

శ్రీదేవి మండిపడ్డది-'చేసినమోసం చాలక ఇది మరోవేషమా? సిగ్గులేదా మీకు? నాపేర మీ రచనలు చెలామణి చేయించుకోవడానికి ఆ కథలేవో పడక పోతే మనకొంపేమీ మునిగిపోదు. తినేందుకు తిండి లేకపోదు-ఇలా పాఠకులనూ పత్రికలనూ మోసగిస్తారా మీకుచ్చితపుబుద్ధితో. చస్తే నేనిక ఈ ఆటను సాగనివ్వను ఏమనుకున్నారో...

పరాంకుశం ఏదో సమాధానం చెప్పేలోగానే శ్రీదేవి ఆ గది వదిలిపెట్టి వెళ్ళిపోయింది....

వరాంకుశం దీనితో షాక్ తిన్నాడు. ఆరోజంతా మరి మాట్లాడకుండా ముభావంగానే ఉండిపోయాడు ఈ సన్నివేశం ఎప్పుడో ఒకనాడు ఎదురొ్కక తప్పదు అలాంటప్పుడు ఇవ్వాళే వస్తే వచ్చిన తప్పేముంది?? అని నిశ్చయిచు కున్నాడు తర్వాత

రాత్రి భోజనాలైన తర్వాత గాలికోసం మంచాలు వరండాలో వేయించాడు

ఇంట్లో పనంతా ముగించి తాంబూలం తీసుకోని వచ్చి శ్రీదేవి మొగుణ్ణి చూచి "ఏం ఇంకా కోపంతగ్గలేదా ఏమిటి? అలాగే ముడుచుకుని కూర్చున్నారు' అన్నది 'లేదు దేవీ-నేనే నిన్నామాట అడగాలనుకుంటున్నాను"

"బాగుంది మీ గడుసుతనం-నాకెందుకు మధ్యలో కోపం అన్ని వేషాలూ మీరే వేసి పైగా...."

వరాంకుశం ఆకులు తీసుకొని నములసాగాడు.

"అయితే ఇంతకూ మీరు మద్రాసుపోతున్నారా-లేదా...." శ్రీదేవి ఆ విష యన్నే కావాలని సాగదీసే ధోరణిలో అన్నది....

వరాంకుశం నవ్వి "ఈ మాసిన గడ్డమూ నేనూ కనుక ఆ మ్యూజిక్ హాల్ లో ప్రత్యక్షమైతే ఒకదెబ్బకెగిరిపోతుంది మనకీర్తి" అన్నాడు.

"పీడాపోయింది. ముఖాన్ని పట్టిపచ్చే ఆ కీర్తి పోతేమాత్రమేం, రాకపోతే మాత్రమేమి, తుమ్మితే ఊడిపోయేముక్కు ఎంతకాలం వుంటుంది? చెప్పేయండి అసలువిషయం నిండుసభలో, బాగుంటుంది...." ప్రతి సమాధానం ఎదురు చూస్తూ అన్నది శ్రీదేవి. వరాంకుశం గట్టిగా గుండెలనిండుగా గాలితీసుకొని అన్నాడు "చూడు-శ్రీదేవీ! పది పత్రికలు తిప్పి పంపిన వైశంపాయనాన్ని మరో పదకొండో పత్రిక అకస్మాత్తుగా ఎందుకు వేసుకున్నది?? అది వరాంకుశం రచన కాక లక్ష్మికుమారి రచనకాబట్టి!! పాఠకులలో ఒకానొక విచిత్రమైన మనస్తత్వం వుంటుంది. అది అందరికీ తెలుసు. సంపాదకులకూ తెలుసు. సాహిత్యంకేవలం సాహిత్యంకోసమే కాక వ్యాపారంకోసం మార్కెటులో వున్నప్పుడు పాఠకుల అభిరుచులు అన్నీ వాళ్ళు గమనించి మరీ సరుకులు అంగట్లో పెట్టాలి. అసలు మానవజాతిలోనే ఆ బలహీనతవుంది ఆఫీసుల్లో లేడీ టైపిస్టులు ఎందుకు? సూపర్ బజార్లో సేల్స్ గర్ల్స్ ఎందుకు?? అందరు అమ్మకందారులుంటే నేను అక్కడే ఎందుకు అప్పడాలుకొన్నాను అవసరంలేకపోయినా. నీవు నన్నెందుకు కోపగించుకున్నావా నాడు! ఇది అందరికీ తెలిసిన విషయమే!

అందుకే కవులు సాహిత్యానికి అదర్శదైవాన్ని పురుషుణ్ణిగా కాక స్త్రీగా కల్పనచేశారు. ఆమెను "భారతి" అన్నారు మాతృమూర్తిగా ఉపాసించారు పుస్త కాలు ఆమెకు కానుకగా సమర్పించారు ఇదంతా శక్తిస్వరూపం పట్ల మానవునికి గల ప్రేమ, వ్యామోహం, ఏదో తెలియని ఆకర్షణ, అన్నిటినీ మించిన ఆరాధన, ఇవన్నీ ఉన్నాయికాబట్టే పరాంకుశం సృష్టించలేని ఆకర్షణ లక్ష్మికుమారి సృష్టిం చింది. అందులోనూ కుమారి, పాఠకులలోని ఒకవర్గంలో భా-ప్రకాశించే రతి-కోరికను, రెచ్చగొట్టింది. అట్లాంటిది ఇప్పుడీ రచనలు పురుషుడు చేశాడని తెలిస్తే వాళ్ళ ఇమేజ్ దెబ్బతింటుంది వాళ్ళ కల్పనలు కల్లలౌతాయి కలల్లో వాళ్ల రచనలు చదివి నిర్మించుకున్న ఊహాసౌధాలు నేలమట్టమౌతాయి అందుకని దేవీ! అపా యంలో ఉపాయం ఇవి నీ రచనలు. నాకు కావలసింది నా పేరూ, డబ్బు కాదు నా రచనలు వెలుగులోకి రావాలి అంతే!! ఇది మీ దోషంకాదు షేక్స్పియరు అనే వ్యక్తి అసలు ఆ ఇంగ్లీషు నాటకాలు వ్రాయలేదట. వల్లభరాయలు క్రీడాభిరామం రచించనేలేదట మొన్నటికిమొన్న వందఏళ్ళ క్రితం సూరిగారి వ్యాకరణం ఒకాయన రాత్రికిరాత్రి తర్జుమాచేసి ఎవరి పేరనో ప్రకటించాడు, సాహిత్యరంగంలో ఇలాంటివన్నీ యుగయుగాలుగా సాగుతూవున్న సరసాలే. ఆ పద్ధర్మంగా ఏవేవో అవసరాలను అనుసరించి సమకా లీన పరిస్థితులకనుగుణంగా రచయిత్రుల పేర్లతో రచనలు పంపితే తప్ప ప్రచు రింపబడని కాలంలో జీవిస్తున్నప్పుడు ఈ ధోరణిని యుగధర్మంగా అంగీకరించి సంతృప్తిచెందడం తప్ప మరొక గత్యతరం లేదు. ఇందుకు ఎవరినీ విమర్శించి లాభంలేదు. శ్రీదేవీ! నీవే లక్ష్మికుమారివి. ప్రయాణానికి సన్నాహాలు చేసుకో" అని ముగించాడు పరాంకుశం.